# వెర్రి చాకిరి

ఏమీ తోచక తలుపు తీసి బయట నిలబడ్డాను. రకరకాల మనుష్యుల్ని, వారి నడకల్ని, రంగురంగుల కార్లని, వాటి శబ్దాలని చూస్తూ, వింటూ పరధ్యానంగా వున్న నాకు "బాగున్నారా అమ్మగారూ" అన్న మాటలు వినిపించాయి. అటు తిరిగాను. సైకిలాపి దిగి నాకేసి చూస్తూ నవ్వుతూ పలకరిస్తున్నాడు రాములు.

"ఏం రాములూ నువ్వా! ఎవరో అనుకున్నా, ఏమిటిలా చిక్కావు.

"నేనేం చిక్కా నమ్మగారు. సుబ్రంగా వున్నాను" అన్నాడు.

"ఎక్కడా ఉద్యోగం ? అదే ఆపీసా, పని బాగుందా, గంగ ఎలావుంది ?" అన్నాను.

వాడు తెలివిగా తలూపాడు.

"ఏరా, అస్సలు కనిపించటమే మానేశావు. ఆపీసుకు వెళ్తానో. వస్తూనో ఒక్కసారి కనిపించి పోవచ్చుగా"

"నిజమే నమ్మగారు! ఎక్కడ వద్దామన్నా, తీరిక లేకుండాపోయింది" అన్నాడు బుర్రగోక్కుంటూ.

రాములు మునుపు మా యింట్లో పని చేసేవాడు. బుద్ధిమంతుడు సిజాయితీ పరుడు.

వెయ్యి వరహాలు ఎదురుగా పెట్టినా చలించని మనసున్న వాడు అందుకే మా వారు వాడిని తన ఫ్రండుకు తెలుసున్న ఆఫీసులో ప్యూనుగా వేయించారు. వాడెప్పుడు కనిపించినా ఆ కృతజ్ఞతతో కళ్ళు మెరిసిపోతూ మాట్లాడు తాడు.

"అయ్యగా రెప్పుడొస్తారండి" "రాత్రి ఏడు కావ స్తుంది ఆయన వచ్చేసరికి. అదిసరేగాని నీ ఉద్యోగంలో చేరాక రానేలేదు. విశేషాలు చెప్పు" అన్నాను, రాములు ఏం చెప్పినా విన సొంపుగా చెప్తాడు, తోచకుండా వున్నా నాకు కాస్సేపు వాడి మాటలు వింటే బాగుండును అని పించింది.

వాడు సైకిల్ స్టాండువేసి....

"ఏముందండమ్మగారు. నాది ఆఫీసు డ్యూటీ కాదండి, మద్ది ఓం డిపార్టు మెంటండి" అన్నాడు నవ్వుతూ.

"అంటే" అన్నాను.

"ఎందుకండి, నా వుద్యోగం పదింటి నుంచి అయి దింటిదాకా కాదండి. తెల్లారగట్ల అయిదింటినుంచి రాత్రి పదింటిదాకానండి" అన్నాడు హాయిగా నవ్వుతూ.

వాడి మాటలకి నాకు నవ్వొచ్చింది.

"ఏం చేస్తావురా అంతసేపు" అన్నాను.

"నాలుగున్నరకి లేస్తానండి. పళ్లుతోమి, పాలబూత్ కి లగెత్తుతానండి. నాలుగు సీసాలపాలు పట్టుకొని అయ్యగారింటింకి పోతానండి. ఎళ్ళడమే ఎళ్ళడం - కుళాయి నీళ్ళు అన్నింటా పట్టేస్తానండి, అంట్లుతోమేసి, దొడ్డి గట్రా చిమ్మేస్తానండి, తెల్లతెల్లారుతుంటే బాయిలర్ అంటించి పడేస్తానండి. ఇంతలో అమ్మగారు లేచి, పాలు కాస్తారండి, నాకో గలాసుడు కాఫీ పోస్తారండి మళ్ళీ నేను, పక్కలన్నీ యెత్తి, గదులన్నీ తుడుస్తానండి - అమ్మగారికి కూరలు తెచ్చి, ఆవెం సెప్పినయి తరిగి పెట్టేస్తానండి. అబ్బాయిగారు లేస్తారండి - ఇంక ఆకాడనుంచి ఒక్కొక్కరికే నీళ్లు - ఏడేడి నీళ్ళు యిచ్చేస్తానండి - అమ్మగారు టిఫిన్ తయారుగుద్ది - అంతా తింటారు. నాకూ పెడతారు - నిజమమ్మగారు, మా అమ్మగారికి చేతికి ఏముక లేదు- ఆ ప్లేట్లు, అయ్యి కడిగేసి టేబులు తాడిచేసి ఓ పక్కన నిలుసుంటానండి, అయ్యగారు లేస్తారండి - ఆరికి బ్రష్, పేస్టూ, గడ్డానికి సామాను, వొక్కటేటండీ - మరన్నీ నేనే నండి" అంటూ బుర్ర గోక్కుని, "అదై పోతదండి, అమ్మాయిగార్ని, అబ్బాయిగార్ని సైకిలు మీద స్కూలుకాడ దిగబెట్టి వస్తానండి, మళ్ళైదైనా బజారుపని చేస్తానండి, అమ్మగారు వంట సేస్తుంటే అల్లం మసాలా నూరిస్తానండి. బియ్యం కడిగిస్తానండి. ఆయమ్మగారు కూరుసుండి డబ్బాలు, సీసాలు - వొహ టేమిట అన్నీ యిస్తానండి - అయితే మాటల్లో చేతికి ఎముక లేదండి, ఏం చేసినా "వోరే రాములూ" అని పెట్టకుండా ఉండదండి -"

“మధ్యాహ్నం పిల్లలకి అన్నాలు తీసుకెళ్తానండి - అయ్యగారికి కాఫీ టిఫిన్ తీసుకెళ్ళి యిస్తానండి, పిల్లల్ని మళ్ళీ స్కూలునుండి తీసుకొస్తానండి - అయిదింటి లోపల హెడ్డుక్లార్కుగారికి ఓపాలి కనబడి మస్తరేయించుకొస్తానండి- రాత్రి వంట మూడొంతులు నేనే సేస్తానండి, పక్కలువేసి పిల్లల్ని పడుకో పెడతానండి, అమ్మగారు, అయ్యగారు తిన్నాక అన్నీ సర్దేసి, అన్నం క్యారేజిలో పెట్టేసుకుని పదింటికి యింటికి నడుసానండి - అంటే - యింటికాడ గంగ వుంటది కదండి. యీ మంచికూరలు అది తినకుండా నా గొంతు దిగదండి అందుకే - అట్టా సేస్తానండి, ఈ వేళ అమ్మగారు వూరెళ్ళారండి - గంగ కోడిమాంసం తెమ్మందండి - వత్తా నండమ్మగారు మళ్ళీ వొత్తానండీ” రాములు సైకిల్ పెడలుమీద బలంగా కాలు వేశాడు -

( “అనామిక” మాసపత్రికనుండి )

కథా నిలయం
శ్రీకాకుళం

శుభం